క్లుప్తంగా

ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ



నెహ్రూనగర్: రంజాన్ పండుగను పురస్కరించుకుని మానవత పరిచర్య సేవా సంఘం ఆధ్వర్యంలో బొంగరాలబీడులోని ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షులు మద్దు ప్రేమజ్యోతిబాబు రంజాన్ పండుగ సందర్భంగా చీరలు, నిత్యావసరాలు అందజేస్తున్నామని చెప్పారు. రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు జియావుర్ రెహ్మాన్, సలీమా, టి.గోవింద్, దేవసహాయం, మల్లేశ్వరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు ఉచిత శిక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏప్రిల్ రెండో తేదీ నుండి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు తెలిపారు. శనివారం కళాశాలలో ఉచిత శిక్షణ తరగతుల పోస్టర్ విడుదల చేశారు. ఏప్రిల్ 2 నుంచి 28వ తేదీ వరకు నిపుణులైన అధ్యాపక బృందం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాల కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 83329 11155, 83320 11155 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, విభాగాధిపతులు ఐతపు నాగాంజనేయులు, దేశిరాజు సంధ్యారాణి పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో బిల్లులు చెల్లించవచ్చు..

కొరిటెపాడు: నెలాఖరు నేపథ్యంలో గుంటూరు సర్కిల్ పరిధిలోని విద్యుత్ బిల్లులు చెల్లించేలా ప్రత్యేక కౌంటర్లు ఆదివారం, సోమవారం సెలవు రోజుల్లో కూడా పనిచేస్తాయని గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎల్.ఎన్.మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లులు చెల్లించేలా మొబైల్‌లో ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్, ఫోన్‌పే, గుగూల్‌పేల నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చని చెప్పారు.

తెగిపడ్డ హైటెన్షన్ తీగలు

పట్నంబజారు: నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట శనివారం మధ్యాహ్నం సమయంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తెగిపడ్డాయి. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. హైటెన్షన్ విద్యుత్ తీగ తెగి పక్కనే ఉన్న చెట్టుపై పడింది. దీంతో ఆ చెట్టుపై స్వల్పంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పట్నంబజారు: మద్యం మత్తులో ఐదుగురు వ్యక్తులు తండ్రి, కొడుకుపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు... జిన్నాటవర్ సెంటర్‌లో బ్యాగుల షాపు నిర్వహించే షేక్ అష్రఫ్ ఈనెల 28వ తేదీ రాత్రి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మోడరన్ బార్‌కు వెళ్లాడు. ఈక్రమంలో పార్కింగ్ విషయంలో అక్కడ ఉన్న కొంత మంది వ్యక్తులతో వివాదం జరిగింది. ఆసమయంలో అష్రఫ్ కుమారుడు హర్షద్ తండ్రి వద్ద షాపు తాళాలు తీసుకొచ్చేందుకు వెళ్లాడు. తండ్రిపై దాడిచేస్తున్న వ్యక్తులను అడ్డుకోబోయిన హర్షద్‌తోపాటు, తండ్రిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు, రేపు పని చేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూ నగర్: ఉగాది, రంజాన్ పండుగల సెలవు రోజుల్లో కూడా యథావిధిగా నగరపాలక సంస్థ ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు పని చేస్తాయని కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారంలో ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించటానికి రెండు రోజులే గడువు ఉన్న నేపథ్యంలో ఆది, సోమవారాల్లో కూడా పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యంగా జీఎంసీ ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేస్తాయన్నారు. ఆస్తి పన్ను వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం రాయితీని వినియోగించుకోవాలన్నారు.

క్షణికావేశం.. తీరని శోకం

- పెరుగుతున్న ఆత్మహత్యలు
- ఈ నెలలోనే 49 బలవన్మరణాలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- మానసిక దృఢత్వం అవసరమంటున్న నిపుణులు

సృష్టిలో వెలకట్టలేనిది, అత్యంత విలువైంది ప్రాణం. కొందరు చిన్న విషయాలకే మనోస్థైర్యాన్ని కోల్పోయి ప్రాణాలు తీసుకుంటున్నారు. సమస్య ఏదైనా పరిష్కారం వైపు ఓర్పుగా అడుగులు వేయాలే తప్ప.. భయపడి బలవన్మరణానికి పాల్పడితే నమ్ముకున్న వారి పరిస్థితి ఏంటో గుర్తుంచుకోవాలి.

పట్నంబజారు: వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్న వారి సంఖ్య జిల్లాలో ఇటీవల పెరుగుతోంది. చిన్న విషయాలకే పలువురు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. సమస్యకు పరిష్కారం వెతుక్కునే ఆలోచనే వారికి రావడం లేదు. కన్నవారిని, నమ్ముకున్న వారిని పుట్టెడు దుఃఖంలోకి నెడుతున్నారు. ఈ నెలలోనే జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 49 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. మరి కొంత మంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు.

చిన్న కారణాలకే ...

- పాతగుంటూరు పరిధిలోని ఆనందపేటకు చెందిన ఒక వివాహిత భర్త స్నేహితులతో కలిసి మద్యం తాగాడనే క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడింది.
- ఆర్టీసీ కాలనీకి చెందిన ఒక యువకుడు ఇంట్లో మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- అరుంధతినగర్‌కు చెందిన ఒక లారీ డ్రైవర్ అప్పులపాలై తారకరామనగర్‌లోని ఖాళీ పొలాల్లో పురుగులు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

ఇటువంటి ఘటనలు కేవలం ఉదాహరణలు మాత్రమే. చిన్న విషయాలకే ప్రాణాలు తీసుకుంటున్న వారు లేకపోలేదు. 2023లో 883 మంది, గతేడాదిలో 806 మంది, 2025లో 162 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

జాగ్రత్త పడాల్సిందే..

ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు కొన్ని అసాధారణ లక్షణాలు కలిగి ఉంటారు. ఒంటరితనాన్ని కోరుకుంటారు. సకాలంలో ఆహారం తీసుకోరు. ఇలాంటి వాటిని ప్రారంభంలోనే కుటుంబ సభ్యులు గుర్తించాలి. వారితో ప్రేమగా మాట్లాడి సమస్య తెలుసుకుని పరిష్కారానికి తోడ్పాటునివ్వాలి. అతిగా నిద్రపోతారు, రాత్రి వేళల్లో నిద్ర పోకుండా ఎక్కువగా ఆలోచిస్తుంటారు. కొన్నిసార్లు అసలు దేనికీ స్పందించరు. మానసిక వైద్యుడి వద్దకు తీసుకుని వెళ్తే ప్రయోజనం ఉంటుంది. సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశమే చాలా సందర్భాల్లో బలవన్మరణాలకు దారి తీస్తుంది. జీవితం, సమస్యలపై సరైన అవగాహన లేకపోవడం కూడా కారణమే. ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబ పరిస్థితి అధ్వానంగా మారుతుంది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కన్నబిడ్డలు ఆత్మహత్య చేసుకుంటే తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తారు. అలాగే, పెద్దలు బలవన్మరణాలకు పాల్పడితే.. వారిపై ఉన్న ప్రేమతో పిల్లల జీవితాన్ని కుంగదీస్తుంది.



తీరిక లేని జీవితాలు

గతంలో ఉమ్మడి కుటుంబాలుండేవి. ఒకరి బాధను మరొకరు పంచుకునేవారు. పెద్దలు క్షణాల్లో సమస్యను పరిష్కరించి, మేమున్నామని భరోసానిచ్చేవారు. ఇప్పుడు కాలం మారింది. చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. నేటి పరుగుల ప్రపంచంలో కుటుంబ సభ్యులను కూడా పట్టించుకోలేనంతగా ఆలోచనా విధానాలు మారిపోతున్నాయి. ఫలితంగా చిన్న సమస్యలకే చాలామంది ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు.

బయటపడొచ్చు



క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఆత్మహత్య భావనను ధైర్యంగా ఎదుర్కోవచ్చు. ఆత్మవిశ్వాసం, మంచి ఆలోచనలు చక్కటి ఫలితాలను ఇస్తాయి. సానుకూల దృక్పథం, కౌన్సెలింగ్ వంటివి పని చేస్తాయి. చాలా మంది జన్యుపరంగా, పరిస్థితుల ప్రభావం వలన ఆత్మహత్యలకు పాల్పడుతూంటారు. జన్యుపరంగా అయితే వారి జీన్స్‌లోనే ఆ భావన ఉంటుంది. పరిస్థితుల ప్రభావమైతే వివిధ కారణాలతో సంఘర్షణకులోనై తనువు చాలిస్తున్నారు. ఆత్మహత్య భావన ఉన్నవారిని ఒంటరిగా ఉంచకూడదు. వీలైనంత వరకు ఇంట్లో వారందరి మధ్య మెలిగేలా చూసి ధైర్యం నింపాలి. అవసరమైతే కౌన్సెలింగ్ ఇప్పించాలి.

– డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్, మానసిక వైద్య విభాగం, జీజీహెచ్

25 ఏళ్ల సేవా ప్రస్థానం ఆదర్శనీయం



ఉగాది కళా పురస్కారాలు అందుకున్న వారితో నిర్వాహకులు

నగరంపాలెం: భారతీయత– స్వచ్ఛంద సేవా సంస్థ 25 ఏళ్ల సేవా ప్రస్థానం ఆదర్శనీయమని ఇస్కాన్ టెంపుల్స్ అంతర్జాతీయ ప్రచారకులు ప్రభువురామ్‌మురారిదాస్ అన్నారు. శనివారం బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై భారతీయ స్వచ్ఛంద సేవ సంస్థ రజితోత్సవ వేడుకలు, అమరావతి సాంస్కృతిక చైతన్య వేదిక ఉగాది సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. డాక్టర్ అంచే విజయలక్ష్మి సభకు స్వాగతం పలుకగా, దేవస్థానం అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. రామ్‌మురారిదాస్ మాట్లాడుతూ సేవాహి పరమోధర్మః అన్న సనాతన భారతీయ సాంస్కృతిక జీవన స్రవంతిలో నైతిక విలువలు, సేవాగుణాలు పెనవేసుకున్నాయని అన్నారు. భారతీయత సంస్థ వ్యవస్థాపకులు, ప్రముఖ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రజల్లో జాతీయత, దేశభక్తి, సమాజంపై బాధ్యతలను పెంపొందించే భారతీయత స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేస్తామని అన్నారు. గుంటూరు బార్ అధ్యక్షులు యర్రంశెట్టి శివసూర్యనారాయణ, అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ పీవీ మల్లికార్జున రావు, రాజధాని ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర రావు ప్రసంగించారు. తెలుగు రాష్ట్రాల యువ గాయకులు కె.లెనీన, పాటల వెంకన్న, రంగం రాజేష్, ఎం.అరుణ్‌కుమార్, పి.అశోక్, బిల్లా నాగరాజులను ఉగాది కళా పురస్కార అవార్డులతో సత్కరించారు. ప్రజా గాయకుడు పీవీ రమణ, స్వర్ణలక్ష్మి, ఫణింద్రబాబు, లక్ష్మీపూజ, ప్రియాంక పాల్గొన్నారు.

బాలికను వివాహం చేసుకున్న వ్యక్తిపై పోక్సో కేసు

లక్ష్మీపురం: బాలికను ప్రేమిస్తున్నాని చెప్పి వివాహం ఆడిన తరువాత ఇద్దరి మధ్య మనస్పార్థలు రావడంతో పట్టాభిపురం పోలీసులను ఆశ్రయించగా పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుజ్జనగుండ్ల ప్రాంతానికి చెందిన కోడూరు సంజయ్(20) పట్టాభిపురం మెయిన్ రోడ్డులో పాత ఆర్టీఓ ఆఫీస్ దగ్గర ఉన్న ఓ షాపులో పని చేస్తుంటాడు. అదే ప్రాంతంలో రోడ్డు పక్కన తోపుడు బండి మీద అరటికాయలు అమ్ముకునే అతడి కుమార్తెను పరిచయం చేసుకున్నాడు. పరిచయం అయిన తరువాత బాలికను ప్రేమిస్తున్నానని చెప్పి నమ్మించి ప్రతి రోజు మాట్లాడుతూ ఉండేవాడు. ఆ క్రమంలో సదరు బాలికను పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో ఎవరికీ చెప్పకుండా 2024లో కల్వరి టెంపుల్‌కు వెళ్లి వివాహం చేసుకున్నాడు. అయితే ఇద్దరు చదువుకోవాలని ఇరువర్గాల వారు నిబంధన విధించారు. కొన్ని రోజులుగా ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో బాలిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఇరువురిని విచారించి, సంజయ్‌పై పోక్సో కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పాలిటెక్నిక్‌లో ఉచిత కోచింగ్

నెహ్రూనగర్: పదో తరగతి పరీక్షలు రాసి పాలిసెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు విక్రమ్ ఇనిస్టిట్యూట్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా ఏపీ పాలిసెట్ కోచింగ్‌ను అందించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ గోన విజయ ప్రకాష్ తెలిపారు. శనివారం కాకాని రోడ్డు, సిటీ మార్కెట్ లోని విక్రమ్ కోచింగ్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివరాలకు 9848772597, 8985674879 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పాండురంగారావు సేవలు ఉద్యోగులకు మార్గదర్శకం

కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారావును సత్కరిస్తున్న కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

లక్ష్మీపురం: కేంద్ర ఆర్థిక పరిపుష్టికి అహర్నిశలు కృషి చేసిన జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ పి.పాండురంగారావు అందించిన సేవలు ఉద్యోగులందరికీ ఆదర్శమని కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం జి.టి. రోడ్డులోని టుబాకో అసోసియేషన్ హాలులో పాండురంగారావు పదవీ విరమణ, సత్కార సభలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు తమ పదవీ కాలంలో ఎంత కాలం పనిచేసామన్నది ముఖ్యం కాదని, ఎంత మంచి పేరు తెచ్చుకున్నారనేది ముఖ్యమని చెప్పారు. విధులపై విధేయత కలిగిన వారు ఎక్కడైనా తప్పక రాణిస్తారన్నారు. పాండురంగారావు ఉద్యోగమే దైవంగా భావించి, పని తీరు తోనే ప్రశంసలందుకున్నారని కొనియాడారు. పదవీ విరమణ కాలం నూతన జీవితానికి, ఉన్నత ఆశయాలకు నాంది కావాలని ఆకాంక్షించారు. పాండురంగారావు మాట్లాడుతూ కమిషనర్ నరసింహారెడ్డి అందించిన ప్రోత్సాహం, ఉద్యోగులందరి సహకారంతోనే తాను అమూల్యమైన సేవలు అందించగలిగానన్నారు. అనంతరం పాండురంగారావును కమిషనర్ ఇతర అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు దుశ్శాలువాలతో, భారీ పూలమాలలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో జి.ఎస్.టి. అడిషనల్ కమిషనర్లు మధుసూదన రెడ్డి, లక్ష్మీనారాయణ అసిస్టెంట్ కమిషనర్లు వి.వి.రావు, నాగరాజు, రవికుమార్, మనోజ్ కుమార్ సూపరింటెండెంట్లు చీదేళ్ల ఈశ్వరరావు, చిట్టి వెంకటేశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, వెంకటాచలం, కాకర్ల శ్రీనివాస్, పూర్ణ సాయి పాల్గొన్నారు.

పాలిసెట్, ఏపీఆర్జేసీ పరీక్షలకు ఉచిత శిక్షణ



కరపత్రాలు విడుదల చేస్తున్న తిలక్‌బాబు, సాంబశివరావు, విజయకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు, ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు పాలిసెట్, ఏపీ ఆర్జేసీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు తెలిపారు. శనివారం విద్యానగర్‌లోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల నగర కార్యాలయంలో ఉచిత శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల చేశారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించనున్న శిక్షణ తరగతుల్లో ప్రతి రోజూ రెండు గంటలు మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో చెరొక గంటపాటు బోధన ఉంటుందని తెలిపారు. అదే విధంగా ప్రతిరోజూ 90 ప్రశ్నలతో కూడిన పరీక్ష, శిక్షణ పూర్తయ్యే లోపు ఐదు ఏపీఆర్జేసీ, పాలిసెట్ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు 88859 95458, 95020 54168 నంబర్లకు ఫోన్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్ష రాయనున్న విద్యార్థులకు ఇంటిగ్రిటీ గ్లోబల్ సర్వీసెస్ యజమాని గోనుగుంట్ల వెంకట్ ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేస్తున్నారని తెలిపారు. విద్యానగర్, కొత్తపేటలోని ఎన్నారై ఇండియన్‌స్ప్రింగ్స్ పాఠశాలల క్యాంపస్‌లలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అచీవర్స్ అధ్యక్షుడు నల్లూరి సాంబశివరావు, కార్యదర్శి కొండపనేని విజయకృష్ణ, గోనుగుంట్ల వెంకట్, రోటరీ సభ్యుడు జొన్నలగడ్డ రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలు



సుమేధ స్కూల్‌లో ఉగాది, రంజాన్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



జీకేఆర్ హైస్కూల్లో విద్యార్థులతో కలసి రంజాన్ ప్రార్థనలు చేస్తున్న జనార్దన్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో శనివారం ముందస్తు ఉగాది, రంజాన్ జరుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉగాది తెలుగువారి నూతన సంవత్సరాది అని, చైత్రశుద్ధ పాడ్యమి రోజున వచ్చే ఉగాదికి ఎంతో విశిష్టత ఉందన్నారు. అదే విధంగా నెల మొత్తం ఉపవాస దీక్షలతో గడిపిన ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. రంజాన్ నెలలోనూ ఖురాన్ ఆవిర్భవించినట్లు ముస్లింలు నమ్ముతారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో ప్రార్థనలు చేశారు.

జీకేఆర్ హైస్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: జీకేఆర్ హైస్కూల్ పట్టాభిపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్‌లలో శనివారం ముందస్తు ఉగాది, రంజాన్ పండుగ జరుపుకున్నారు. ఈసందర్భంగా వేద పండితులు ఉగాది విశిష్టతను, ముస్లిం మత పెద్దలు రంజాన్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా అన్ని పండులను పాఠశాలలో జరుపుకోవడం, వాటా విశిష్టతను విద్యార్థులకు తెలియజెప్పడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈసందర్భంగా ముస్లిం విద్యార్థులు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ శైలజ, సుశీల పాల్గొన్నారు.

థింక్ లైక్ ఏ క్లౌడ్ యాక్ట్ లైక్ ఏఐపై సెమినార్

గుంటూరు రూరల్: సమస్యల పరిష్కారానికి పూర్తిగా సాంకేతికతపై ఆధారపడకుండా, స్వీయ ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎర్నెస్ట్ యంగ్ ఎల్ఎల్‌పి టెక్నాలజీ కన్సల్టెంట్ సీనియర్ మేనేజర్ పవన్‌సతీష్‌కుమార్ అన్నవరపు తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో థింక్ లైక్ ఏ క్లౌడ్ యాక్ట్ లైక్ ఏఐపై అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కంటి మీద కునుకు పడితే ఒట్టు

- సర్వే బాట పట్టిన వార్డు సచివాలయ ఉద్యోగులు
- సుమారు 12 రకాల సర్వేలు చేయిస్తున్న ప్రభుత్వం
- రెగ్యులర్ విధులు కూడా నిర్వహించాలని హుకుం
- ఎక్కడైన చిన్న పొరపాటు దొర్లితే సస్పెండ్ చేస్తున్న వైనం
- ఓటీపీల విషయంలో ప్రజలు అభ్యంతరం



సచివాలయం

నెహ్రూనగర్: ప్రభుత్వం వివిధ సర్వేల పేరుతో వార్డు సచివాలయ ఉద్యోగులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సుమారు 12 రకాల సర్వేలను చేయాలని.. చేయకపోతే శాఖ పరమైన చర్యలు ఉంటాయని అధికారులు బెదిరింపులు దిగడంతో ఒక పక్క సర్వేలు చేసుకుంటూ.. మరో పక్క రెగ్యులర్ విధులు నిర్వహించుకుంటూ ఒత్తిడికి గురవుతున్నారు.

విధుల్లో తీవ్ర ఒత్తిడి...

నగరపాలక సంస్థ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్, వర్క్ ఫ్రం హోం సర్వే, పీ 4 సిటిజన్ కన్సల్టేషన్, పన్నుల వసూలు, పూర సేవ యాప్, పీజీఆర్ఎస్ ఈకేవైసీ, సిటిజన్ ఈకేవైసీ, హౌస్ హోల్డ్ డేటా, ఇలా మొత్తం 12 రకాల పేరుతో సచివాలయ ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఒక వేళ ఎవరైన అత్యవసరం పరిస్థితుల్లో సదురు సర్వేలు చేయకపోతే వారిపై సస్పెన్షన్లు అని భయాభ్రాంతులకు గురిచేయడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ప్రశ్నలే...ప్రశ్నలు

సచివాలయ సిబ్బంది క్లస్టర్ వారీగా ఆయా కుటుంబాల నుంచి సామాజిక, ఆర్థిక స్థితిగతులను 27 ప్రశ్నల ఆధారం సమాచారం నమోదు చేస్తున్నారు. మరో వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏమైనా పథకాలు అందుతున్నాయా అనే వివరాలు సేకరించి వాటిని సచివాలయాలకు అనుసంధానం చేస్తున్నారు.

ఓటీపీ చెప్పేందుకు ఇష్టపడడం లేదు..

అసలే బ్యాంక్ ఖాతాలో డబ్బులు కాజేసేందుకు ఎన్నో సైబర్ క్రైంలు జరుగుతున్న నేపథ్యంలో ఇలా మాటిమాటికి ఇళ్ల వద్దకు ఆధార్ చూపండి.. సెల్‌కి ఓటీపీ వచ్చింది చెప్పండి తమ వ్యక్తిగత గోప్యతకు భద్రత లేకుండా పోయిందని నగర ప్రజలు సచివాలయ సిబ్బందిని నిలదీస్తున్నారు. దీంతో సర్వేలు పూర్తి స్థాయిలో చేయలేక సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతుంటే అధికారులేమో చెప్పిన సమయానికి సర్వే పూర్తి కావాలని గట్టిగా ఆదేశాలు ఇస్తున్నారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పథకాలు తీసివేసేందుకేనా?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యక్తిగత వివరాలు సేకరించడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ల కోత, కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడం, రేషన్ కార్డ్ ఈకేవైసీ పేరుతో ప్రజలకు ఇచ్చే ఆ కాస్త వసతులను తీసివేసేందుకు కుట్ర పన్నుతుందా అని ఆవేదనం చెందుతున్నారు.

ఇంటికి వెళ్లేదెప్పుడు

నగరపాలక సంస్థ పరిధిలో 1600 మంది సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. నగరపాలక సంస్థలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు 10.30 గంటల నుంచి సాయంత్రం గంటలకు వెళ్లిపోతుంటారు. కాని సచివాలయ ఉద్యోగులకు మాత్రం వేళ పాళ లేకుండా కాన్ఫరెన్స్ కాల్స్ అని, అధికారుల సమావేశం అని, సర్వేల పేరుతో మానసికంగా హింసిస్తున్నారని లోలోపల సచివాలయ ఉద్యోగులు మదన పడుతున్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



నెహ్రూ నగర్: స్థానిక నెహ్రూ నగర్ ఏడోలైన్ లోని ఆక్స్ ఫర్డ్ హైస్కూల్‌లో యూకేజీ, 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐడీ డీఎస్పీ పి.లక్ష్మయ్య, స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ శామ్యూల్ రెడ్డి ఇదా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

లక్ష్మీపురం: కంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి కోరారు. స్థానిక నల్లగుంట ప్రాంతంలో సీపీఐ ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి సాకారంతో శుక్లముల ఆపరేషన్ క్యాంపు శనివారం నిర్వహించారు. నగరంలో ఇప్పటికి పాత గుంటూరు, అశోక్ నగర్, శారద కాలనీ,ఏటి అగ్రహారం శివ నాగరాజ్ కాలనీ, స్వర్ణభారత్ నగర్, చంద్ర రాజేశ్వరరావు నగర్, ప్రగతి నగర్,స్వర్ణ భారతి నగర్ శిబిరాలు నిర్వహించి 5300 మందికి ఆపరేషన్లు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, భీమవరపు శ్రీనివాసరావు, సైదులు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 11న ఉపముఖ్యమంత్రి ఇంటి వరకు పాదయాత్ర

లక్ష్మీపురం: ప్రభుత్వాలు మారినప్పుడల్లా పంచాయతీ కార్మికులను రాజకీయ కక్షలతో అక్రమంగా తొలగిస్తున్నారని, ఇప్పటికీ జిల్లా వ్యాప్తంగా వంద మంది కార్మికులు తొలగించడం అన్యాయం అని పంచాయతీ కార్మికుల జిల్లా యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాసరావు తెలిపారు. పాత గుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం సిహెచ్.రామారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 11న విజయవాడ నుంచి పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఇంటి వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, టి.సంధ్యారాణి, పిల్లి మేనకరావు, ఆర్.సంగమేశ్వర రావు, చీలి నాగేశ్వరావు, నూతక్కి వీరయ్య పాల్గొన్నారు.

నేడు ఉగాది క్రీడా పురస్కారాలు

గుంటూరు వెస్ట్: గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ సంయుక్తంగా ఉగాది క్రీడా పురస్కారాలు అందజేయనుననట్లు నిర్వాహకుడు జీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడల్లో ప్రతిభ, సేవ, శిక్షణ తదితర అంశాలను ప్రధానంగా తీసుకుని వారిలో అవార్డులకు ఎంపిక చేసామన్నారు. వీరికి ఆదివారం స్థానిక జేకేసీ రోడ్డులోని వీవీవీ హెల్త్ క్లబ్‌లో పురస్కారాలు అందజేస్తామన్నారు.